# ప్రేమలేఖా?!

"వెళ్లగానే లెటర్ వ్రాయండి" అన్నాడతను.

"ప్రేమలేఖా?" కిలకిల నవ్విందామె కొంటెగా చూస్తూ. అతను విస్మయం నుండి తేరుకునే లోపే ట్రెయిన్ స్టేషన్ దాటింది.

* * *

"హలో" ఓ యువకుని స్వరం.

"హలో" అంది భారతి, యువకుని వైపు చిరునవ్వుతో చూస్తూ.

"మా చెల్లెలు శ్రీలక్ష్మి. మా సీనియర్ మిస్టర్ వాసుదేవరావు" చెల్లెలికి, యువకునికి పరస్పర పరిచయం చేసింది. భారతి.

"ఎక్కడినుండి వస్తున్నారు?" అడిగాడు వాసు.

"యూనివర్సిటీ నుండి. పురజనులంతా యూనివర్సిటీలో ఇందిరాగాంధీ, దుర్గాబాయి దేశ్‌ముఖ్‌ల అనర్గళ ఉపన్యాసాల్ని విన కుతూహలులై వుంటే మీరిదేమిటి హవామహల్ ప్రాంతాల్లో స్నేహితునితో బాతాఖానీ కొడుతూ వుండి పోయారు?" అంతకుముందే వాసు దగ్గర సెలవు తీసుకుని వెళ్ళిపోతున్న అతని మిత్రుణ్ణి చూస్తూ అడిగింది భారతి.

"స్నేహితునితో బాతాఖానీ కొడతానికి కాదు, సంధ్యా సుందరిని చూడడానికి వుండి పోయాను." అన్నాడు వాసు ఓరగా శ్రీలక్ష్మివంక చూస్తూ. నుదుట తిలకాన్ని దిద్దుకుంటున్న సంధ్యా కాంతను సముద్రపు అద్దంలో చూస్తూ నిల్చుంది శ్రీలక్ష్మి.

"బొత్తిగా కవిలామాట్లాడుతున్నారేమిటి?"- భారతి.

"కవిని కాక పోయినా, కవిలా మాట్లాడంలో తమాషా లేదూ?" నవ్వేశాడతను.

"పోనివ్వండి. మీ సిస్టర్ కాన్వొకేషన్‌కి వచ్చారా? ఏం డిగ్రీ పుచ్చుకున్నారు? నడిచి వస్తున్నారేం?"

"మైగాడ్! యిన్ని ప్రశ్నలే? సరే వినండి. అవును. బి.ఎస్‌సి. డిగ్రీ. బస్సులు దొరకవనే గ్యారంటీ. అందుచేత వెలుగుండగానే కాళ్ళకు బుద్ధి చెప్పడం మంచిదనే సదుద్దేశంతో లెఫ్ట్ రైట్ కొట్టుకుంటూ వచ్చేశాం."

"హాస్టల్‌కేనా వెళ్ళడం?"

"ఔను. నాకైతే మీకులాగానే బీచ్‌లో కూర్చుని సంధ్యాసుందరిని చూడాలని వుంది కాని మా చెల్లెలుంది చూసారూ, దీనికి కళాభిరుచి కొంచెం కూడా లేదు. కనీసం కళాహృదయం వున్నట్లు నటించడం కూడ తెలియదు. పైగా అంటుంది కదా, "అక్కా! నా కడుపులో ఎలికలు ఒలింపిక్ పరుగు పందాలకు సన్నాహాలు చేస్తున్నాయి. ఇప్పుడు కడుపులో కాస్త కాఫీ, టిఫెన్ పడకపోతే నా పని రా!" అంది భారతి నవ్వుతూ. వాసు నవ్వేశాడు.

"అక్కా!" కోపంగా అక్క వంక చూసింది శ్రీలక్ష్మి

"అబ్బే! వట్టిదేనండీ! మా చిన్నికి బోల్డు కళాభిరుచి వుంది." చెల్లెలి వంక కొంటెగా చూసింది భారతి. శ్రీలక్ష్మి వంక చూస్తున్న వాసు కళ్ళల్లోని మెరుపుల్ని చూచి ఆశ్చర్య పోయిందామె.

"హోటలుకి వెళ్దాం పదండి" అన్నాడతను.

"డబ్బులు మీరు పెట్టుకుంటే వచ్చి దర్జాగా ఆరగించడానికి నాకేం అభ్యంతరం లేదు. కాని, మా చెల్లెలు ఉత్తి తిక్కది. వస్తుందనే గ్యారంటీ యివ్వలేను." అంది భారతి చెల్లెలివంక చూస్తూ.

"మీకేమైనా అభ్యంతరమా?" శ్రీలక్ష్మి నడిగాడు వాసు. వాసువంక ఆశ్చర్యంగా చూచింది భారతి. ఎంతమంది అందమైన అమ్మాయిలు ఆకర్షించాలని ప్రయత్నించినా కన్నెత్తి కూడా చూడని వాసు, ఒకవేళ మాట్లాడవలసి వచ్చినా అతి నిర్లిప్తంగా మాట్లాడే యీ అందమైన అబ్బాయి, అందగత్తె అనడానికి వీల్లేని తన చెల్లెలివంక యింత ఆసక్తిగా చూడడం, యింతగా పరిచయాన్ని ఎక్కువ చేసుకోవాలని చూడడం వింతగా కనిపించింది భారతికి.

"అభ్యంతరమేముంది? కాని, చాలా అలసటగా వుంది. వెరీ సారీ!" ఎటో చూస్తూ ఎవరికో జవాబిచ్చినట్టుగా అంది శ్రీలక్ష్మి.

ఓ అమ్మాయి నుండి యింత నిర్లక్ష్యంగా జవాబు పొందడం మొదటిసారేమో వెంటనే షాక్ నుండి తేరుకోలేక మౌనంగా వుండిపోయాడు ఓ నిముషం. వాసు ముఖంలో భావాలు చదవడానికి ప్రయత్నిస్తూంది భారతి.

"సరే!" అని ఓ క్షణం ఆగాడు వాసు.

"మీ చెల్లెల్ని ఎక్కడకూ తీసుకువెళ్ళరా భారతీ!" అడిగాడతను.

"రేపు బంధుమిత్రులందరిని సందర్శించి ఎల్లుండి ఉదయం సింహాచలం వెళ్తాం, మీరూ రండి. సరదాగా తిరిగొద్దాం" అంది భారతి.

"ఓ .కె. థాంక్స్. మరి నే వెళ్తాను. వస్తానండీ!" శ్రీలక్ష్మి వంక ఓ సారి చూచి పద్మనివాస్ వైపు వెళ్ళిపోయాడతను.

***

ఉదయం ఎనిమిది గంటలయింది. అలంకరణ పూర్తి చేసుకుని కిటికీలో

నుండి మంచు మేలిముసుగు జారవిడుస్తున్న పర్వతాల్ని చూస్తోంది శ్రీలక్ష్మి. ఓ ఫియట్ కారు వచ్చి హాస్టల్ గేటు ముందాగింది. ట్రాన్సిస్టర్, కెమెరా ప్రక్కన పెట్టి కారు దిగాడతను.

"అక్కా! అతనొచ్చాడు" అంది శ్రీలక్ష్మి.

"ఎవరు? వాసా?

"ఊ" అక్క క్రిందికి దిగి వెళ్ళడం వినిపించింది. అతని వంక పరిశీలనగా చూసింది శ్రీలక్ష్మి. తెల్లటి బట్టల్లో, చామనచాయ రంగుతో, ఎత్తుగా, బలిష్టంగా వున్న వాసుని చూసి ఓ క్షణం స్పందించటం మరచిపోయింది శ్రీలక్ష్మి హృదయం. ప్రశాంతంగా వున్న అతని ముఖం, నవ్వుతున్న కళ్ళు, హుందాగా నిలబడటం- కన్నె హృదయంలో కలలు రేపేలా వున్నాయి.

"చిన్నీ! మాకిప్పుడు క్లాసుందట. యీ క్లాసుకి వెళ్ళకపోతే ప్రొఫెసర్ ఇంప్రెషన్ పోతుంది. తెలుసుగా నీకు. ఇంప్రెషన్ల బ్రతుకు మాది. నువ్వు వాసుతో వెళ్ళు." అంది భారతి బుక్స్ తీసుకుంటూ.

"ఉహు. నేను వెళ్ళనక్కా."

"కాదు చిన్నీ! అతనేమన్నా అనుకుంటాడు" అంది భారతి ఏదో పుస్తకం కోసం చూస్తూ.

"బొత్తిగా పరిచయం లేనతని వెంట షికార్లు కొట్టి రమ్మంటావేమిటక్కా?" విసుగ్గా అంది శ్రీలక్ష్మి.

"అతనివెంట వెళ్ళడానికి భయపడనక్ఖర్లేదు చిన్నీ! ప్లీజ్! వెళ్ళు" హేండ్‌బాగ్ చెల్లెలి చేతిలో పెట్టింది భారతి. శ్రీలక్ష్మి మాట్లాడడానికి కూడా అవకాశం లేకుండా బయటకు లాక్కెళ్ళి రూమ్‌కు తాళం వేసింది భారతి.

"మరి వెళ్ళిరా. అలా ముఖం ముడుచుకుని వుంటే బావుండదు! ప్లీజ్ చిన్నీ!" అంది భారతి శ్రీలక్ష్మి చుబుకం పట్టుకుని ఊపుతూ.

"నువ్వు మరీనక్కా!" అంది శ్రీలక్ష్మి చిరుకోపంతో.

"బెస్ట్ ఆఫ్ లక్! బెస్ట్ఆఫ్ టైమ్" అంది భారతి వెళ్తున్న చెల్లెలి వంక ప్రేమగా చూస్తూ.

శ్రీలక్ష్మి నవ్వుతూ చెయ్యి వూపింది.

"నమస్తే" అన్నాడు వాసు శ్రీలక్ష్మిని చూడగానే. మందహాసంతో ప్రతి నమస్కారం చేసింది శ్రీలక్ష్మి.

"కూర్చోండి" ముందు డోర్ తెరిచాడు వాసు. క్షణం ఆలోచించి కారెక్కింది శ్రీలక్ష్మి.

పట్టణం వెలుపలకు వచ్చేసింది కారు. సంభాషణనెలా సాగించాలో అర్థం కాలేదు వాసుకి. ఏమడిగితే ఎలా జవాబు వస్తుందోనని భయపడుతున్నాడు. అతని సంకోచాన్ని గమనించి తనలో తను నవ్వుకుంటూంది శ్రీలక్ష్మి

"సిగరెట్ కాల్చుకోవచ్చా!" సిగరెట్ ముట్టించుకో బోతూ శ్రీలక్ష్మి వంక చూశాడు.

"నిరభ్యంతరంగా" అంది శ్రీలక్ష్మి ఆడుకుంటున్న మేఘబాలల మీది నుండి దృష్టి మరల్చకుండానే.

గాఢంగా సిగరెట్ పీల్చి పకపకా నవ్వాడు వాసు. నిర్లిప్తంగా వాసు వంక ఓసారి చూసి ముఖం తిప్పేసుకుంది శ్రీలక్ష్మి.

"ఎందుకు నవ్వానని కూడ అడగరేం?" ఆసక్తిగా ఆమె వంక చూశాడు వాసు.

వాసు వంక ఓ క్షణం చూచి గలగలా నవ్వింది శ్రీలక్ష్మి.

"ఎందుకు నవ్వుతున్నారు?" ఆశ్చర్యంగా ఆమె వంక చూశాడు వాసు.

"ఏం లేదు." నింపాదిగా జవాబిచ్చింది శ్రీలక్ష్మి.

"కారణం లేకుండా ఎందుకు నవ్వుతారు? చెప్పండి. ఎందుకు నవ్వారో?! ఆపుకోలేని కుతూహలం కనపడుతూంది అతని స్వరంలో.

"ఏం లేదు."

"కాదు చెప్పండి ప్లీజ్."

కిలకిలా నవ్వింది శ్రీలక్ష్మి.

"మీరు నవ్వినప్పుడు నేనడిగివుంటే యిలాంటి జవాబులే యిచ్చేవారు మీరుకూడా! నేను నిర్లక్ష్యంగా ఊరుకునేప్పటికి ఓ మెట్టు క్రిందికి దిగారు. నేను మరి కొంచెం సేపు మౌనంగా వుంటే మీరు నవ్విన కారణాన్ని స్వయంగా సెలవిచ్చే

వారు" మందహాసంతో వాసువంక చూసింది శ్రీలక్ష్మి.

"మనిషి ఎప్పుడూ యింతే వాసుదేవరావుగారూ! ఏ వ్యక్తి తనని నిర్లక్ష్యం చేస్తే, ఆ వ్యక్తి మీద అంతులేని కుతూహలం, ఆకర్షణ పెరిగిపోతాయి. తనమీద ఆసక్తి చూపే వ్యక్తిని నిర్లక్ష్యం చేసి ఆ వ్యక్తికి మరీ అర్ధంకాకుండా వుండేలా, మరీ గొప్పగా కనపడేలా ప్రయత్నిస్తాడు." అంది శ్రీలక్ష్మి. దెబ్బతిన్న వాడిలా ఆమె వంక చూసాడు వాసు. మళ్ళీ మౌనం వ్యాపించింది.

"మీ గ్రూప్ ఏమిటి?

"కొంపదీసి ప్రశ్నలేస్తారా ఏమిటి?"

"అబ్బే! అ భయం అఖ్ఖర్లేదులేండి." చిన్నగా నవ్విందామె.

"మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ."

"యూనివర్సిటీకి రాలేదేం?"

"పెళ్ళవదేమోనని భయం." వెటకారం కదిలిందా మాటల్లో.

"అదేం?" ఆశ్చర్యంగా ఆమెవంక చూశాడు వాసు.

"యిప్పటివరకు లేడీస్ కాలేజీలో చదివాను కాబట్టి ఫరవాలేదు. యూనివర్సిటీ అంటే ఎప్పుడో ఒకప్పుడు అబ్బాయిల్తో మాట్లాడవలసి వస్తుంది. అలాకాక, భద్రంగా వంచిన తలెత్తకుండా చదువుకున్నా, పై చదువులు చదివిన అమ్మాయిలికి దూరంగా పారిపోతున్నారట చదువుకున్న అబ్బాయిలు. అంచేత."

"మీరు మరీ దారుణంగా మాట్లాడుతున్నారు."

"నిజాలు దారుణంగానే వుంటాయి మరి."

శ్రీలక్ష్మి అబ్బాయిల మీదకు దండెత్తే సన్నాహంలో ఉండడం చూచి మౌనంగా వుండి పోయాడు వాసు.

స్వామిని దర్శించి అందమైన దృశ్యాలన్నింటినీ కెమెరాలో దాచుకున్న తరువాత ఆలయంలో కొన్న పులిహోర పొట్లాలు విప్పారు.

"ఎప్పటి వరకు వుంటారు మీరు?

"సాయంత్రం మెయిల్‌లో వెళ్ళిపోతాను" అంది శ్రీలక్ష్మి.

"ఏమైనా కబుర్లు చెప్పండి" అడిగాడతను. ఓ నిమిషం తరువాత చిరుహాసంతో మౌనంగా వుండిపోయిందామె.

"ఏవైనా సరే. కథలైనా సరే. మీ ప్రేమకథలైనా సరే" చిలిపిగా నవ్వుతూ అమె వంక చూశాడు. తృళ్ళిపడి అతనివంక చూచిందామె. ఓ క్షణం వివిధరకాలైన భావాలామె మనసులో కదిలాయి.

"నాకేమీ లేవు. ప్రేమ కథలకు మీకే ఎక్కువ అవకాశం వుంది." అందామె సహజంగా నవ్వుతూ.

"మీకు వినే ఓపికుండాలి కాని నాకు చాలా ప్రేమకథలున్నాయి. చెప్ప మంటారా?"

"చెప్పండి."

"సావకాశంగా వినాలంటే సాయంత్రం మా రూమ్‌కు రండి."

"మీ రూమ్‌కా." చురుగ్గా అతని వంక చూసింది శ్రీలక్ష్మి.

"ఊ!"

ఓ నిమిషం ఆలోచిస్తూ వుండి పోయింది శ్రీలక్ష్మి.

"సరే సాయంత్రం హాస్టల్‌కు వచ్చి నన్ను తీసుకు వెళ్ళండి." అందామె. ఏదో పట్టుదల, దృఢ నిశ్చయం కనబడుతున్నాయామె వదనంలో.

"మరి మీ ప్రయాణం?"

"రేపు మెయిల్‌కి వెళ్తాను."

"ఓ.కె." విజయహాసం కదిలిందతని కళ్ళల్లో.

***

ఫస్ట్‌క్లాస్ వచ్చేంత బాగా పరీక్షలు వ్రాసి పరీక్షా ఫలితాలకోసం ఎదురు చూస్తున్న విద్యార్థిలా శ్రీలక్ష్మి లెటర్ కోసం ఎదురు చూడసాగాడు వాసు. హాస్పిటల్‌కు వెళ్ళకుండా ఆలోచిస్తూ పడుకున్నాడు.

కేవలం పువ్వులా వుండే స్త్రీ మగవాడికి మోహాన్ని కలిగిస్తుంది. భ్రమరమై ఆ స్త్రీ కన్నీటి కథలకు కారకుడౌతాడు.

నిప్పులాంటి స్త్రీ భయాన్ని కలిగిస్తుంది - పారిపోయి పువ్వులకు భ్రమరమవడానికే సిద్ధపడతాడు.

పువ్వులా వుంటూనే నిప్పు ధర్మాన్ని కూడ సంతరించుకున్న స్త్రీ వింత ఆకర్షణను కలిగిస్తుంది - ఆమెను పొందాలని తహతహలాడతాడు పురుషుడు.

శ్రీలక్ష్మి! మూడోతరహా స్త్రీయా? ఎప్పుడూ ఏ స్త్రీని గురించి ఆలోచించని తను యింతగా శ్రీలక్ష్మి గురించి ఆలోచించడం. ఎడ్వెంచర్ కోసం తప్పితే ఓ అమ్మాయి స్నేహాన్ని సీరియస్‌గా తీసుకోవడం అలవాటు లేని తను శ్రీలక్ష్మి కోసం యింతగా అస్థిరుడైపోవడం - నవ్వుకున్నాడు వాసు.

"రిజిష్టర్ లెటర్ సార్!" పోస్ట్‌మన్ కేకతో ఆలోచనలలో నుండి బయటపడ్డాడు వాసు. సంతకంచేసి, ఆత్రుతగా లెటరు విప్పాడు వాసు. శ్రీలక్ష్మి!

"వాసుదేవరావుగారూ!

నమస్తే!

చల్లని పిల్లగాలులు నైట్‌క్వీన్ పరిమళాలతో మత్తు కలిగిస్తూండగా ఆలోచనలు అల్లిబిల్లిగా అల్లుకుపోతున్నాయి. నా వైజాగ్ ప్రయాణం, మీతో పరిచయం పదే పదే జ్ఞాపకానికి వస్తున్నాయి. మనిషి మనస్తత్వాన్ని ఓ క్రొత్తకోణంలో నుండి చూపిన మీకు ధన్యవాదాలర్పించకుండా వుండలేను.

ఇట్టే ఆకర్షించే మీ రూపం, క్షణాలమీద మనిషిని కట్టి వేసుకోగల మీ చక్కటి ప్రవర్తన, అద్భుతమైన మీ తెలివితేటలు-వీటిని చూచి అభినందించకుండా వుండలేను. కాని అసహ్యించుకోకుండానూ వుండలేను, తెలివినిలా దుర్వినియోగ పరుస్తున్నందుకు.

ఎంత తెలివి లేకపోతే యింత మంది ఆడపిల్లల్ని ఆకర్షించి వాళ్ళ హృదయాల తో ఆటలాడుకుని, చివరకు నిర్లక్ష్యంచేసి, వాళ్లు ఏడుస్తుంటే మీరు తమాషాగా నవ్వుకోగలుగుతారు? బివేర్... రాళ్లు రువ్వి ఆనందించడం అలవాటైన మీకు రాళ్లు రువ్వించుకునే రోజు కూడా వస్తుంది వాసుగారూ!

"మీ జీవితంలోకి యింతకుముందు వచ్చిన అమ్మాయిలకు కూడా యిలాగే ప్రేమలేఖల్ని చూపించి మీ ప్రేమ కథల్ని వినిపించారా?" అని నేనడిగాను. "ఔను, నా గురించి పూర్తిగా తెలుసుకుంటే మంచిదికదా! అందుకని ప్రతిదీ దాచకుండా చెప్తాను" అన్నారు. మీ యీ జవాబులో నిజాయితీ వెల్లివిరుస్తుందని మీరనుకుని

గొప్పగా ఫీలయిపోతే నాకేం అభ్యంతరంలేదు. కాని నేను మాత్రం అలా అనుకోలేను. మీ యుక్తివేరు. అప్పటికే మీ ఆకర్షణలో పడి కొట్టుకుంటున్న అమ్మాయి అవన్నీ విని అంత మంది అమ్మాయిల ప్రేమ పాత్రుడు, అంతటి గొప్పవాడు నా వాడయ్యాడు కదా అనే వెర్రి ఆలోచనతో, ఓ విధమైన మత్తుతో మీ గొప్పతనం ముందు మోకరిస్తుందని మీకు బాగా తెలుసు.

మీ ప్రేమకథలు వినిపించే ముందు "పొరపాటున కూడా ఎవరితోనూ అనకండి. మగవాడిని నాదేముంది కాని పాపం. ఆ అమ్మాయిల జీవితాలు నాశనమవుతాయి." అన్నారు. భేష్! మీ ఉదాత్తత, మగవాడిననే అహం బాగా చూపించుకున్నారు. ఎదుటవున్న అమ్మాయి దృష్టిలో మీరింకా గొప్పవారయి పోవడానికిదో అస్త్రం.

మిమ్మల్ని ప్రేమించిన అసంఖ్యాకులైన అమ్మాయిలు కాక, మీ జీవితంలోకి సన్నిహితంగా వచ్చిన ముగ్గురు అమ్మాయిలను గురించి చెప్పారు మీరు. మొదటి అమ్మాయి రాజేశ్వరి. మీ మామయ్య కూతురు. తనని గురించి చెప్తూ మీరన్న మాటలు గుర్తువుండే వుంటాయి బహుశా! "పిచ్చి పిల్ల! చిన్నతనం కదూ, నన్ను ప్రేమిస్తున్నాననుకునేది. నిజానికి తనకి తగను నేను. అందుకే తనను పెళ్లి చేసుకోలేదు." మీ మంచితనాన్ని వెలిబుచ్చాలనే ఆశతో చెప్పినా, యధార్థం చెప్పారు. నిష్కల్మషమైన ఆమె ప్రేమకు తగరు మీరు. మీ ప్రేమలేఖలన్నిటినీ చూపి రెండింటిని మాత్రం చూపించలేదు. ఎవరో పిలిస్తే బయటకు వెళ్లారు మీరు. ఏదోతెలియని కుతూహలం ఆ లెటర్స్‌ని తీసి నా హేండ్‌బాగ్‌లో దాచేలా చేసింది. యిదిగో చదవండి, రాజీ చివరిసారి మీకు వ్రాసిన లెటరు. మళ్లీ ఓసారి అద్దంలో మీ ప్రతిబింబం చూసుకున్నట్లవుతుంది.

"బావా!

యింక కొన్ని గంటల్లో మరొకరి దాన్నవబోతున్న నాకు చివరిసారి నీకు లెటరు వ్రాయాలనిపిస్తూందంటే నాలో ప్రేమ అనేది యింకా మిగిలి వుందేమోనని అనుమానమొస్తూంది. ఛ! 'ప్రేమ' అంటేనే అసహ్యం వేస్తూంది. యీ 'ప్రేమ' ముందు నా సర్వస్వం, చివరకు నా అస్తిత్వాన్ని కూడ విస్మరించాను. యీ ప్రేమకోసం నా అభిమానాన్ని ప్రక్కకు పెట్టి నిన్ను యాచిస్తూ జాబు వ్రాశాను. దానికి నీ జవాబు - 'నీకు అన్నయ్య లాంటి వాడిని రాజీ! నిన్నెలా చేసుకోను?" - యీ మాట లెటరులో వ్రాశావు కాబట్టి సరిపోయింది కాని, నాముందు నిలబడి

అని వుంటే చెప్పు తీసివుండేదాన్ని. పల్లెటూరి పిల్ల ఏం చెయ్యగలుగుతుందనేమో నీ ధీమా! నీకు అభిమానం అనేది లేదు కాబట్టి నన్ను చెల్లెలనుకుని సరిపెట్టుకోగలిగావు మనసుని. కాని... నా దృష్టిలో 'అన్నయ్య' 'చెల్లెలు' అనే పదాలకు కొన్ని విలువలున్నాయి 'అన్నయ్య' అనే మధురమైన పదాన్నిలా 'రాజీ! ఐ లవ్ యూ!' అంటూ, మామిడి తోపులో ఆవుదూడని నిమురుతూ స్వచ్ఛంగా నవ్వుకుంటున్న రాజీ పెదవులమీద ఆవేశంతో, వాంఛతో కాలిపోయే తన పెదవులాన్చి ముద్దిడుకున్న పశువుకి, లోకం తెలియని కన్నె హృదయంలో కలలులేపి, ఆ కలల్ని నేలరాచే నీచుడికి వాడలేను. ఆనాడలా నాలో స్త్రీత్వాన్ని కదిలించి ప్రేమించడం నేర్పావు. యీనాడదే స్త్రీత్వాన్ని అవమానించి నన్ను రెచ్చగొడుతున్నావు. అవమానంతో రగులుతున్న నా గుండె నిన్ను శపిస్తూంది బావా! నువ్వు నాలానే ప్రేమ వంచితుడవై బాధపడాలి. రాజీ హృదయం పగిలి కన్నీరు కార్చినట్లే నువ్వూ ఓనాడు కన్నీరు కార్చాలి.

మా నాన్నకు డబ్బు ఎక్కువ వుండి కాదు బావా నీ విలువైన బట్టలకు, నీ షోకులకు, సరదాలకు చదువుకు వేలకువేలు ఖర్చుపెట్టింది. అల్లుడ్ని చేసుకుందామనే అభిప్రాయంతో అభిమానధనుడైన మీనాన్ననతికష్టం మీద ఒప్పించి నీ భారాన్ని వహించారని యింత త్వరలో మరచి పోతావనుకోను. నీ దగ్గర్నుండి వచ్చి నువ్వు వ్రాసిచ్చిన ప్రోనోట్ నాచేతిలో పెడుతూ నాన్న అన్నారు. "కారు అవీ అడగడానికి నాకే సిగ్గనిపించిందమ్మా! ఆ దౌర్భాగ్యుడు పదివేలకు నోటు రాసిచ్చాడు." నాన్న ముందే ఆ ప్రోనోట్‌ని చింపేసి "యీ ముక్కలు తన ముఖం మీద కొట్టి రావలసింది నాన్నా! మనిషికి విశ్వాసం, అభిమానం అనేవి లేకపోయిన తరువాత యీ డబ్బు మాత్రం మననేం ఉద్ధరిస్తుంది?" అన్నాను.

ఓ గంట పోయిన తరువాత నా గదిలోకి వచ్చారు నాన్న. "నీకు వాడినే చేసుకోవాలనుంటే చెప్పు.. కాళ్ళు చేతులు కట్టి తీసుకువచ్చయినా నీ మెడలో పుస్తె కట్టిస్తానమ్మా!" అన్నారు. "ఛ! తనంటే అసహ్యం నాన్నా! అతన్ని గురించి యిక ఆలోచించవద్దు. నువ్వు యోగ్యుడనుకున్న వాడికెవరికో ఒకరికిచ్చి పెళ్లిచేసేయి" అన్నాను. కాని తడిసిన దిండు, ఎర్రబడిన కళ్ళు, పీక్కుపోయిన ముఖం - నాకు బాధ లేదంటే నమ్మకం కలిగించేలా లేవు. నాన్న నావంక ఓ నిమిషం చూస్తూ వుండిపోయి దీర్ఘంగా నిట్టూర్చారు. నా గదిలో నుండి వెళ్ళిపోతూ అన్నారు. "నిన్ను ఏడిపించినందుకు ఒక రోజు వాడూ ఏడుస్తాడమ్మా!" నీ దౌర్భాగ్యం కాకపోతే ప్రేమతో దీవించవలసిన వాళ్ళు అసహ్యంతో శపిస్తారా?

నా విషయం పోనియ్యి బావా! నీ ఆలోచనలు, అంతస్తులు, అభిరుచులు పెరిగి పోయాయని సరిపెట్టుకుంటాను. మీ కుటుంబం విషయం తెలిసికూడా యింత బాధ్యత లేకుండా ప్రవర్తిస్తున్నావంటే నిన్నేమనాలో తెలియడం లేదు. చిన్నబావ ఇంజనీరింగ్ నీలా వెలగబెడుతూ చదవడం లేదు. ట్యూషన్లు చెప్పి సంపాదించుకుని చదువుతున్నాడు. కనుకనే తనకు డబ్బు విలువ తెలుసు బావా! నాన్న డబ్బు పంపితే తిప్పి పంపుతూ వ్రాసాడు -"మీ అభిమానానికి కృతజ్ఞుడిని మామయ్యా! అవసరం వచ్చినప్పుడు తప్పకుండా నీ దగ్గరకు వచ్చి అడిగి తీసుకొంటా! తిప్పి పంపుతున్నందుకు క్షమించు" - అంత అభిమానం తనకు. అల్లుణ్ణి కొనుక్కొనే తాహతు లేక ఎదిగిన కూతుర్ని యింట్లో పెట్టుకుని కుమిలి పోతున్న మీ అమ్మ, కొడుకులకు చదువు చెప్పించలేకపోతున్నాననీ, కూతురి పెళ్లి చేయలేక పోతున్నాననీ, చిన్న పిల్లల కోరికలు తీర్చ లేకపోతున్నాననీ క్రుంగి పోయే మీ నాన్న - వాళ్ళను చూసి నాకు కన్నీళ్ళాగలేదు బావా!

నీకు లెటరు వ్రాస్తానంటే వదిన అంది "వద్దు రాజీ! అన్నయ్య అదృష్టం కొద్దీ సుఖపడుతున్నాడు, తననన్నా ఈ బాధలకు దూరంగా హాయిగా వుండనీయి." నేనే నీ స్థానంలో వుంటే మనిషినింత స్వార్థపరుడిని చేసే అదృష్టాన్ని విసిరి పారేసి నౌకరుగా వుండయినా సంపాదించి కుటుంబానికి పెట్టేదాన్ని. నా కుటుంబంలోని వాళ్లు సరైన తిండికి, మంచి బట్టకు మొఖం వాచి వుంటే నేను మెరీనా హోటల్‌కీ, టెరిలిన్, రేయాన్ క్లాతింగ్‌కీ, కేప్‌స్టన్ సిగరెట్లకీ, బాల్కనీ పిక్చర్లకీ, సరదా పిక్‌నిక్స్‌కీ వందలకు వందలు తగలేస్తూ యువరాజులా పోజ్ చెయ్యగలిగేదాన్ని కాను. పల్లెటూరి మొద్దు, పట్టణంలోని సముద్రాన్ని, లైట్‌హౌస్‌ని, సింధియాని, యూనివర్సిటీని వర్ణించి చెప్తుంటే యింతింత కళ్ళు చేసుకుని వినే పిచ్చిపిల్ల రాజీకి యింత ఖరీదైన విషయాలెలా తెలిశాయా అని ఆశ్చర్యంతో బిగుసుకు పోవద్దు. బావా! నీతో బాటు రాజీ కూడా పెరుగుతూందని మరిచిపోయావు. బావ చెప్పింది వేదంగా తలచే రాజీ యిప్పుడు కూడా "నిజమేనేమో! బావ నాకు అన్న లాటి వాడేమో" అనుకుని నమ్మేస్తుందని అపోహ పడ్డావు, పోనియ్. నీకు విలువలు తెలీవు, ప్రేమ విలువా, జీవితం విలువా, ఆడదాని కన్నీళ్ళ విలువా, డబ్బు విలువా ఏమీ తెలియవు నీకు.

నిజానికిదంతా వ్రాయాలని కాదు నేను లెటరు రాయడం మొదలు పెట్టింది. కానీ... కసి, అరికట్టుకోలేని వేదన యిది రాయిస్తున్నాయి. ఇంకా కొద్ది గంటల్లో మరొకరితో మాంగల్యం కట్టించుకుంటాను! నీ నీడలా బ్రతుకుదామనుకున్న

నేను, నీ జీవితంలో నుండి శాశ్వతంగా తప్పుకొని మరొకరి అర్ధాంగినవబోతున్నాను - సుఖ పెట్టాలని, సుఖపడాలనే ఆశతో, అలా చేయగలననే ఆత్మవిశ్వాసంతో. యీ సమయంలో నాదొక్క కోరిక బావా! తప్పకుండా తీరుస్తావనే ఆశిస్తా! మాడబ్బు నిన్ను చదువుకు దూరం చేయడం నాకిష్టం లేదు. నీ చదువయ్యే వరకు యిదివరకటిలానే నాన్న డబ్బు పంపిస్తారు. పంపిన దాన్లో కొంత మీ ఇంటికి పంపేయి. నువ్వే సంపాదిస్తున్నానని చెప్పు. మాదని చెప్తే తీసుకోరు అభిమానంతో. యిన్ని అబద్ధాలు నేర్చిన వాడికి యీ ఒక్క అబద్ధం ఆడడమేమంత కష్టం కాదేమో!

ఈ లెటర్‌ను కోపంతో చించి వేయవద్దు. దాచుకో. నా శాపం ఫలిస్తుందో లేదో చూద్దువు గానీ. ఆశీర్వదించగల స్థైర్యం, సహృదయత మిగిలుంటే ఒకనాటి నీ రాజీ మరోసారి మోసపోదని ఆశీర్వదించు.

'నీద'ని చెప్పుకోవడానికి అసహ్యించుకునే - రాజీ.

వాసుదేవరావుగారు! పదం మోటుగానే వుండనీ గాక. 'చెప్పు తీసే దాన్ని' అని రాయగలిగిన రాజీని మర్చిపోలేను. - 'బావా! నీ దగ్గరున్న నా ప్రేమలేఖల్ని చింపేయి. నా కాపురాన్ని నాశనం చెయ్యావనే ఆశిస్తా!' యిలా రాసి వుంటుందని ఊహిస్తూ రాజీ లెటరు చదివిన శ్రీలక్ష్మి 'దాచుకో నా శాపం ఫలిస్తుందో లేదో చూద్దువు గానీ' అని రాసిన రాజీ స్థైర్యంముందు, కన్నెపిల్ల హృదయం పారేసుకుని ప్రేమలేఖలు రాయడం పొరపాటే అయితే, ఆ పొరపాటుకు తగిన శిక్ష అనుభవించడానికి సిద్ధంగా వున్న రాజీ నిజాయితీ ముందు 'ఈ ముక్కల్ని అతని ముఖాన కొట్టి రావలసింది నాన్నా!' అన్న రాజీ అభిమానం ముందు, ఆమె సబలత్వం ముందు తలవంచింది. పురుషుని పసందైన మాటల్లో పడి సర్వస్వం పోగొట్టుకుని ఆ పోగొట్టుకోవడంలో తన బాధ్యత, తన తెలివితక్కువ కూడా ఉందని మరచిపోయి ఆ పురుషుణ్ణి నిందిస్తూ, అర్థంలేని సెంటిమెంట్స్‌తో జీవితాన్ని నరకం చేసుకొనే భారత స్త్రీని చూసి విసుక్కుంటున్న శ్రీలక్ష్మి సంతోషంతో 'రాజీ! శభాష్' అంది. ఆడసింహంలా గర్జిస్తూనే తనలోని ఔదార్యాన్ని, క్షమను, సానుభూతిని వెలిబుచ్చుకోగలిగిన రాజీ ఔన్నత్యం నా హృదయం మీద చెరగని ముద్ర వేసింది. వాసుగారూ! అంత విషాదంలోనూ 'సుఖపెట్టగలను. సుఖ పడగలను' అన్న రాజీ ఆత్మవిశ్వాసాన్ని చూచి ఉప్పొంగిపోయాను. రాజీ సుఖపడగలదు. కష్టాల్లో నవ్వుల్ని సృష్టించగలదు. అలాటి రత్నాన్ని చేజేతులా విసిరేసిన మీ మూర్ఖత్వానికి జాలి పడకుండావుండలేను.

రెండో అమ్మాయి - నీనా! సౌందర్యానికి ప్రతి రూపాన్ననుకుంటుంది. సినిమా తారలా మేకప్ చేసుకుని, వాలుచూపుల్తో అబ్బాయిల్ని ఆకర్షించాలని తాపత్రయ పడుతుంది. తను విసిరే అస్త్రాలు విసురుతూనే, మరోవైపు ఫలానా అబ్బాయి తన కటాక్ష వీక్షణం కొరకు సర్వస్వం త్యాగం చేస్తానంటున్నాడనీ, ఫలానా వెధవ తన చిరునవ్వు కొరకు పడిఛస్తున్నాడనీ, ఫలానా వెధవన్నర తన చీర కొంగు స్పర్శకోసం అనుక్షణం బాడీ గార్డులా తిరుగుతున్నాడనీ చెప్తూ తనకదంతా యిష్టం లేనట్లు, యింకా మాట్లాడితే అసహ్యమన్నట్లు నటిస్తుంది. యిదీ మీరిచ్చిన నీనా పరిచయం! మీ మాటలు పూర్తిగా అబద్ధమనను నేను. అలాంటి అమ్మాయిలుం డరనీ అనలేను. కానీ... అలాంటి అమ్మాయినే అనేక ఉపాయాలతో ఆకర్షింప చేసుకుని ఆమెతో రాసక్రీడలు జరిపి, భార్యాభర్తలయి జీవితాంతం ఒకటిగా ఉందామని ప్రమాణాలు చేసుకున్నారు. మీతో తన పెళ్లి గురించి అందరితో చెప్పి మిత్ర బృందానికి పార్టీ యిచ్చిన తర్వాత మీరామెను పెండ్లాడననడం, అదీ మిమ్మల్ని పొందాననే గర్వంతో ఆమె నిర్లక్ష్యం చేసి అవమానించిన అబ్బాయిల ముందు అనడం మాత్రం దారుణం. అంత అవమానాన్ని ఆ అందాలరాణి సహించలేక ఆత్మహత్య చేసుకోవడం మరీ ఘోరం.

చదవండి! హృదయాన్ని కలచి వేసే 'నీనా' ఉత్తరం. ఈ సారన్నా ఆమె జీవితంలో మీ పాత్రని గుర్తిస్తారేమో!

నా వాసూ!

జీవితంలో యింత పరాజయం పొంది జీవించి వుండాలనిపించడంలేదు. ఆలోచిస్తే ఒకటనిపిస్తోంది. స్త్రీని అనుమానించి, అవమానించడంలో అలనాటి శ్రీరాముడు మొదలు యీనాటి వరకు పురుషుడు ఒకే స్థితిలో వున్నాడు. తన నమ్మికనే గుడ్డిగా పట్టుకుని పాకులాడడం తప్పితే ఆ స్త్రీని కూడా అడిగి నిజానిజాలు తెలుసుకోవాలనే జ్ఞానం లేకపోవడం శోచనీయం. ఐనా నన్ను కోపంతో దహించి వేసేది ఒక విషయం వాసూ! అవకాశం దొరికితే అనుభవాల కోసం యత్నించే పురుషుడు తన భార్య మరొకరి వంక చూస్తేనే, మరొకరితో మాట్లాడితేనే గింజుకు ఛస్తాడేం? 'పవిత్రత' అనే పదానికి అర్థమే లేనపుడు, అది అనావశ్యకమే అయినపుడు, అది పురుషునికెంతో స్త్రీకీ అంతే కదూ?

మొన్నరాత్రి దేవతలా కనిపించి తన సర్వస్వం నీకర్పించిన నీనా, నిన్న రాత్రి సెకండ్ షోకి ఇద్దరబ్బాయిల్తో వచ్చిన నీనా, ఈ రోజు నీ జీవితంలో అడుగు

పెట్టరానిదిగా మారిపోవడం మీ పురుషుల కళ్ళు పెట్టుకు చూస్తే న్యాయంగానే కనిపిస్తుంది. నన్ను నిరాకరించడానికి కారణం ఆ యిద్దరబ్బాయిలతో నేను పిక్చర్‌కి రావడమన్నావు. నాలాటి పతితను జీవితాంతం భరించలేనన్నావు. నాకు పగలబడి నవ్వాలనిపిస్తూంది వాసూ! అదే పిక్చర్‌కి నిన్న రాత్రే నువ్వు ఇద్దరు కాదు, నలుగురమ్మాయిల్తో వచ్చావు. అవును! నీవు మగాడివి. నలుగురు కాదు. పదిమంది తోనైనా రావచ్చు నీ విషయంలో తప్పులేదు. సంఘం నిన్ను సమర్థిస్తుంది. నీ ఆధిక్యాలన్నీ నిలబెడుతుంది. నేనది గుర్తించలేక నా తమ్ముడితోనూ, నా తమ్ముడిలాంటి వాడి స్నేహితుడితోనూ పిక్చర్‌కి రావడం ఘోరమైన పొరపాటు. మగవాళ్ళ కోసం మగవాళ్ళు సృష్టించిన ఈ సంఘనీతిలో స్త్రీ స్వేచ్ఛను గురించి మాటలు కోటలు దాటేదాకా చెప్పడమే కానీ స్వేచ్ఛగా తిరిగే స్త్రీని చూసి గుండెలు బ్రద్దలు కొట్టుకుంటారని తెలుసుకోకపోవడం మరో పొరపాటు. ఆడదాన్ని అందినంతవరకు వాడి పారేయొచ్చనే తలంపుతో పెళ్ళి ఎర చూపించి సర్వస్వం దోచుకునే కిరాతకుల్ని ప్రేమించడం మరో క్షమించరాని పొరపాటు. నిజమే, యిన్ని పొరపాట్లు చేసిన స్త్రీని ఏ పొరపాటూ చెయ్యని నువ్వేం పెళ్ళి చేసుకోగలవు?

ఏ సౌశీల్యం లేదని నిన్ను నీవు మోసం చేసుకున్నావో ఆ సౌశీల్యానికి నా దృష్టిలో విలువ వేరు. ఆ విలువ పోగొట్టుకోకుండా వుండడానికే నీతో గడిపిన రాత్రిని శాశ్వతంగా మరచిపోయి, పవిత్రురాలిగా నటిస్తూ మరొకరి జీవితంలో ప్రవేశించలేకపోతున్నాను. ఇంక నీ పాదాలమీద పడి కన్నీళ్ళతో పాదాలు కడిగి నన్ను పెళ్లి చేసుకోమని దేవురించడమనేది చచ్చినా చేయను. కానీ... హృదయంలోని అశాంతి, కలవరం నన్ను పిచ్చిదాన్ని చేసేలా వున్నాయి. అందాలరాణి నీనా పిచ్చిదిగా చనిపోవడం భరించలేదు. అందుకే వాసూ... విరిసీ విరియని యీ 'రోజా' రాలిపోతూంది.

నిన్ను చంపి నేను చావాలన్నంత కసి వుంది... కానీ కనీసం తిట్టను కూడా తిట్టలేకపోతున్నాను. నన్ను దగా చేసినందుకు ప్రతిఫలం అనుభవిస్తావని కూడా శపించలేకపోతున్నాను. ఆలోచిస్తే నాలో నీమీద కసికన్నా, నీమీద మమతే ఎక్కువున్నదనిపిస్తూంది. ఈ జన్మలో నీమీద కసి తీర్చుకోకపోవడం నా దౌర్భాగ్యం. కానీయ్! భగవంతుడు, మరో జన్మ అనేది వుంటే నన్ను స్త్రీ గానూ నిన్ను పురుషుడుగానే పుట్టించి నీ మీద కసి తీర్చుకొనే అవకాశం కలిగించమని ప్రార్థిస్తా! అప్పటికన్నా ఈ సామాజిక వ్యవస్థ మారి స్త్రీ తన బలహీనతల నుండి విముక్తి చెంది దెబ్బకు ఎదురు దెబ్బ తీయగలిగే స్థితికి రావాలని, వస్తుందని నా ఆశ.

క్షణం గడుస్తున్న కొద్దీ ప్రేమాతిశయంతోనూ, జీవితం మీద ప్రీతితోనూ నీ కాళ్ల మీద పడి వేడుకునే స్థితికి కూడా దిగజారతానేమోనని భయంగా ఉంది. ఇంక ఆలస్యం కానీయను. మొదలేలేని ఈ జీవితానికిప్పుడే ముగింపు పలికేస్తాను.

నీదిగానే చనిపోతున్న - నీనా!

లెటరు పూర్తవగానే నా నిట్టూర్పుకు నేనే ఉలిక్కి పడ్డాను. నాగరికతా జాడ్యంలో పడి 'నీనా'గా మారిన 'నాగశిరోమణి' మీద జాలేసింది. తన సౌందర్యాన్ని ఎరగా పెట్టి తనచుట్టూ యువకులంతా కుక్కల్లా పడి తిరుగుతూంటే తమాషాగా ఆనందించాలనే వెర్రి కోరికకు అలవాటు పడిన నీనాకు యింత దారుణమైన శిక్షా? మీ కుటిలత్వానికీ, స్వార్థానికీ, కఠినత్వానికీ ఓ స్త్రీ నిండు జీవితం బలి అయింది. మీలాటి వారికి లోకపు న్యాయస్థానాల్లో శిక్ష లేదు. కానీ ఒకటి మరిచిపోకండి, భగవంతుని న్యాయస్థానంలో తప్పు చేసిన వాడు శిక్ష తప్పించుకోలేడు.

నాకు ఆశ్చర్యం కలిగించిన విషయమొకటి, ఇంత జరిగినా మీరు వైజాగ్‌లో గౌరవంగా బ్రతుతున్నారంటే, 'అతని వెంట వెళ్ళడానికి భయపడక్కర్లేదు' అని అక్క అనేంత మంచి పేరు మీకు అమ్మాయిల్లో కూడా వుందంటే తప్పకుండా ఈ సంఘటన వైజాగ్‌లో జరగలేదని ధృవపడింది. మీ రూం నుండి హాస్టల్‌కు వెళ్లగానే అక్కను క్రాస్ ఎగ్జామ్ చెయ్యగా తేలింది, మీరు ఎనాటమీలో ఫెయిలయి అక్టోబర్‌లో పాసయ్యారని, అక్టోబర్ బేచ్‌తో చదవడమిష్టంలేక ఆ ఎనిమిది నెలలూ మానేసి మళ్లీ జూన్ బేచ్‌తో మూడవ సంవత్సరంలో జాయినయారని. ఆ సమయంలో మరో నగరంలో మకాం పెట్టి నీనాతో పరిచయం చేసుకున్నారనీ, ఆమె చనిపోగానే అక్కడ మకాం ఎత్తేసి వైజాగ్ వచ్చేసి వుంటారనీ ఊహించాను. మీ ప్రవృత్తిని చూసి మరోసారి గుండె మీద చెయ్యేసుకున్నాను.

మూడో అమ్మాయి సునంద, యూనివర్సిటీ విద్యార్థిని. 'విద్య, రూపం, గుణం - వీటి అరుదైన మేళవింపు సునందలోని ప్రత్యేకత. అబ్బాయిలతో సరదాగా వుంటూనే ఎవరైనా హద్దు మీరితే చెంపదెబ్బ కొట్టడానికి వెనుదీయదు. బాగా ఆలోచించిగానీ అడుగు ముందుకువేయదు. ఒకవేళ వేసిందీ అంటే మరి వెనుదిరగదు. ఎందుకు వేసానా అని ఆనక విచారించదు'' అంటూ సునందను పరిచయం చేసారు మీరు. సునందను యధాతథంగా అర్థం చేసుకున్న వారిలో మీరు కూడా ఒకరు. కానీ సునంద నా సన్నిహిత మిత్రురాలని తెలియని మీరు

సునంద గురించి పాతపాటే పాడారు. సునంద దస్తూరి బాగా తెలిసిన నాకు సునంద పేరుతో మీరు వ్రాసుకున్న లేక వ్రాయించుకున్న ప్రేమలేఖల్ని చూపించారు. సునందలాంటి అమ్మాయి కూడా మీ ఆకర్షణ నుంచి తప్పించుకోలేక పోయిందనీ, ప్రేమలేఖల్లో తన హృదయాన్ని మీ ముందు పరిచిందనీ, మీరూంకి వచ్చి మీరు లేకపోతే బ్రతకలేనని ఒకేటే యిదయిందని చెప్పారు. యింక మీరు సునందకి మీలాంటి వాడు తగడనీ, అంత ఉజ్జ్వల భవిష్యత్తు వున్న అమ్మాయికి మీకంటే గొప్పవాడు లభిస్తాడనీ ఆమె ఉన్నత స్థాయిలో జీవితం గడపటమే మీకు సంతోషాన్ని చేకూరుస్తుంది కనుక ఆమెను నిరాకరించానని చెప్పారు. సునంద ఆలోచించి గానీ ఒకడుగు ముందుకు వెయ్యదని చెప్పిన మీరు మళ్ళీ యిలా మాట్లాడి స్వయంగా పట్టుబడ్డారు.

మీ గురించి పూర్తిగా తెలుసుకోవాలనే ఉత్కంఠతో వైజాగ్ నుంచి తిరిగి వచ్చేప్పుడు సునంద దగ్గరకు వెళ్లాను. మీ గురించి మా మధ్య జరిగిన సంభాషణ యధాతథంగా రాస్తాను.

"సునందా! నీకు మెడికల్ స్టూడెంట్ వాసుదేవరావు తెలుసా?"

"తెలుసు, ఏం"

" ఏం లేదు. అతని మీద నీ అభిప్రాయమేమిటి?"

"అమ్మాయిల్ని ఆకర్షించాలని తాపత్రాయపడతాడు. ఆ తాపత్రయంతోనే నాదగ్గర వేషాలేయబోయాడు. వెధవ్వేషాలేస్తే పళ్ళురాలగొడతానని ఖచ్చితంగా చెప్పాను. ఈ విషయం తప్పితే మిగతా అన్ని విధాలా మంచివాడనిపిస్తాడు."

"నువ్వు గానీ అతన్ని ప్రేమించావా?"

పకపకా నవ్వింది సునంద.

"నాన్సెన్స్! మనకి ప్రేమేమిటీ? ఏ అవతారంగాడో వచ్చి 'నువ్వు దేవతవి సునందా! నీకోసం నేను ప్రాణం కూడా త్యాగం చేస్తాను.' అంటే 'నేనూ అంతే నండీ! మీరు లేకపోతే నాకు బ్రతుకే లేదు' అని సిగ్గు పడుతూ డైలాగ్‌లు వెయ్యడం నాకు రాదు సరికదా ఆ అన్నవాడి పళ్ళు రాలగొట్టబుద్దేస్తుంది. ప్రేమ మాటలు న్నాయి చూశావ్ లక్ష్మీ! వీటికన్నా పచ్చి అబద్ధాలు మరివుండవు. ఆ మాట్లాడే వాళ్లకూ తెలుసు అవి అబద్ధాలని. కానీ నమ్మించడానికి నటిస్తారు. యిదంతా ఎదుటి వ్యక్తిని మానసికంగా, శారీరకంగా వశపరచు కోవడానికి తప్పితే మరేం

కాదు. మనిషి దేవతా కాదు. ఒక మనిషి లేకపోతే మరొక మనిషి బ్రతకలేక పోవడమన్నది ఒట్టిబూటకం. ప్రాణత్యాగం గట్రా అనేవసలే కోతలు." అంది సునంద నిర్లక్ష్యంగా.

"ఏదైనా తన దాకా వస్తే గాని తెలియదు సునందా! అప్పుడు ప్రేమ లేదనవు. ప్రేమ తప్పితే మరేం లేదంటావు!"

నిశితంగా నావైపు ఓ క్షణం చూచింది సునంద.

"ప్రేమ లేదనడం లేదు లక్ష్మీ! ఏ కోటికో ఒకటుంటుంది, ప్రేమ అనే పదానికి అర్థమైన అనుబంధం. మనలోని ఆవేశాలకు, అనుభవాల అన్వేషణకు 'ప్రేమ' పేరు తగిలించుకొని సంఘం కోసం మా పవిత్ర ప్రేమను త్యాగం చెయ్యాం. అంటూ ఉపన్యాసాలు దంచుతూ, లోకం దృష్టిలో చెడిపోయిన వారిలా పేరు పడి, లోకం మాటలకు బాధపడ కుండా వుండలేక, ధైర్యంగా ముందుకు సాగలేకా ఏడవవద్దంటాను. మనిషి సుఖం కోసం మంచిని పోగొట్టుకున్నాక, సుఖలాలస మత్తు తీరింతర్వాతనైనా విచారిస్తాడు. ఎంత చెడ్డవాడికైనా మనసులోనైనా మంచివాడనిపించుకోవాలని వుంటుంది."

"ఒకవేళ నువ్వు ప్రేమిస్తే ఏం చేస్తావో చెప్పదూ!" అన్నాన్నేను. చిన్నగా నవ్వింది సునంద.

"ఒక్కోసారి యింతగా ఆలోచించడం ఎందుకలవాటు చేసుకున్నానా అనిపిస్తుంది లక్ష్మీ! నాలో ప్రేమించగల శక్తి లేదా అనిపిస్తుంది. యింత మంది అబ్బాయిలని చూసాను. కొంత మంది అబ్బాయిల్తో పరిచయముంది. కానీ ఎన్నడూ తీయని ఊహలతో నా హృదయం బరువెక్కదేం? ఆలోచన నాలోని మృదుత్వాన్ని హరింపచేస్తూందా? ఏ అనుభూతులూ లేకుండా, ప్రతి విషయాన్ని ఈ లాభనష్టాలలో, మంచి చెడులతో బేరీజు వేస్తూ యంత్రంగా బ్రతికేస్తానా! బ్రతుకు నింత సారవిహీనం చేసే ఆలోచనలేకపోతేనేం! మళ్ళీ నా ఆలోచనలకు నాకే సిగ్గేస్తుంది. నా ఆలోచనే నా చెవిలో రహస్యం చెప్తుంది "రావలసిన రాకుమారుడొచ్చి హృదయాన్ని స్పృశిస్తే తియ్యటి కలల బరువుతో క్రుంగి పోతావులే." అని చిత్రంగా సిగ్గు పడింది సునంద. నాకు తెలియని మరో సునందని చూస్తున్నట్లనిపించింది. రాగరంజితమైన ఆమె ముఖాన్ని చూస్తూ కూర్చున్నాను.

"ఒకవేళ ప్రేమిస్తే పెళ్లి చేసుకుంటాను కానీ ప్రేమ తిరుగుళ్లు తిరగను. నలుగురూ మంచిదన్న మార్గం నాకూ మంచిదనిపిస్తే ఆ మార్గంలో నడుస్తాను.

కష్టాలొస్తాయా సహిస్తాను. సుఖం లేకపోయినా 'మంచి' అన్నా మిగులుతుంది. మంచీ, సుఖం రెండూ లేకుండా ఆత్మహత్యకు దిగజారడమంటే అసహ్యం నాకు." మళ్లీ నేనెరిగిన సునంద.

వాసుగారూ! యిప్పటికైనా యీ ముగ్గురమ్మాయిల జీవితాల్లో మీ పాత్ర ఎలా వుందో ఒప్పుకుంటారుగా. యీసారి గూడా నేర్పుగా వల విసిరారు. కానీ నా నిర్లక్ష్యం మిమ్మల్ని పరాజితుల్ని చేసింది. పరాజయాన్ని ఒప్పుకోలేక, అహాన్ని చంపుకోలేక మీరు అక్క దగ్గర అన్నారు. "శ్రీలక్ష్మి గారిని ప్రేమిస్తున్నాను... పెళ్ళి విషయం మాట్లాడడానికి మీ నాన్నగారికి రమ్మని చెప్పండి." ఈ వాక్యం మీ పరాజయాన్నే కాక అల్పత్వాన్ని కూడా వెలిబుచ్చింది. మీ హోదాను, గొప్పతనాన్నీ చూచి శ్రీలక్ష్మి నాన్న ముగ్ధులైపోయి, మారు మాట్లాడకుండా కాళ్ళు కడిగి కన్యాదానం చేస్తారనుకున్నారా? శ్రీలక్ష్మికి కూడా స్వంత యిష్టాలూ, ఆలోచనలూ ఉంటాయనేది మరచిపోయి, కనీసం మరిచి పోయినట్లు నటించి మీరు ఊఁ అనగానే వచ్చి మీ హృదయం మీద వ్రాలిపోతుందని అభిప్రాయపడ్డారు అవునా? ఆడదాని మీద యింత మంచి అభిప్రాయాలున్న మీలాంటి గొప్పవారికి నాలాటి సామాన్య యువతి, యింతగా ఆలోచించడం అలవాటైన అమ్మాయి అర్ధాంగిగా తగదు.

మీకంటే అందగాడిని, మీకంటే చదువులో, గుణంలో, అధికుడిని భర్తగా పొందగల, కొనుక్కోగల శక్తి వుంది నాకు. చిత్రమేమింటంటే గుణంలో తప్ప మీకంటే మరే విధంగానూ ఆధిక్యత లేని వాణ్ణి పెళ్ళాడాలనుకుంటున్నాను. జీవితం మీద ఎక్స్‌పెరిమెంట్ చెయ్యాలని వుంది వాసు గారూ! శ్రీమంతురాలిగా పుట్టి పెరిగిన ఓ చదువుకున్న అమ్మాయి తన కంటే తక్కువ చదివినవాడిని పెళ్లాడితే ఆ దాంపత్యం ఎలా వుంటుంది. కేవలం హృదయ బంధాన్నాధారం చేసుకుని దాంపత్యం నిలవగలుగుతుందా? బాహిరమైన శక్తుల ప్రభావమే ఎక్కుగా వుండి ఆ దాంపత్యం మూన్నాళ్ళ ముచ్చటవుతుందా? చూడాలని వుంది. అందుకే దారిద్ర్యాన్ని వరించి శ్రీధర్‌ని పెళ్ళాడబోతున్నాను. మా దాంపత్యం సుఖంగా సాగిపోవడానికి సర్వవిధాలా ప్రయత్నిస్తాను.! ఒకవేళ భంగపడినా బాధ పడను. ఆవేశంతో కాక ఆలోచించిచేస్తున్నాను కనుక రాగల కష్టాల్ని స్వీకరించడానికి సిద్ధపడే వున్నాను. ఇదండీ నా విషయం.

స్త్రీ పురోగమనపు సంధి కాలంలో మీకు తారస పడ్డ ఈ నలుగురూ నాలుగు రకాల స్త్రీ వర్గాలకు ప్రతిబింబాలు వాసుగారూ! ఈ నాలుగు రకాల జీవితాల్ని

చూస్తుంటే ఒకటనిపిస్తూంది నాకు- "మనిషి మంచి చెడులకు, ఇప్పుడు మనకు లభిస్తున్న విద్యకు ఏమీ సంబంధం లేదు. ఈ విద్య తెలివిని పెంచుతూంది. సంస్కారాన్ని కలిగించడం లేదు."

మీ అనుమతి లేకుండా 'రాజీ' 'నీనా'లు రాసిన లెటర్స్ తీసినందుకు క్షమించండి. ఆ క్షణంలోనో, మరుక్షణంలోనో ప్రేమ ప్రకటన చేయబోయేట్లున్న మీ గురించి పూర్తిగా తెలుసుకోవాలంటే ఆ లెటర్స్ తీయక తప్పలేదు మరి.

యింక మీ ప్రేమ విషయం. మొదటిది - మీరసలు నన్ను ప్రేమించలేదు. నేను నిర్లక్ష్యం చేసాను కాబట్టి నా విషయం తేల్చుకోవడానికలా అని వుంటారు.

రెండవది - ఒకవేళ మీరు ప్రేమించారనుకుంటే - తాటాకు మంట ఎంత త్వరలో ఉజ్జ్వలంగా అగుపిస్తుందో అంత త్వరలోనే ఆరిపోతుంది వాసుగారూ! ప్రేమలో స్థిరత్వాన్ని వాంఛించే నేను మీ ప్రేమను స్వీకరించడానికి అశక్తురాల్ని.

మూడవది - మీరు నిజంగానే మనస్ఫూర్తిగా నన్ను ప్రేమిస్తూంటే, నేను లేకపోతే మీకు బ్రతుకే లేదనుకుంటే, పోనివ్వండి. రాజీ శాపం ఫలిస్తుంది.

నేను ఊహించినట్లే నా హృదయంతో ఆటలాడుకునే ఉద్దేశం తప్ప మరేం లేకపోతే - మీకే మంచిది. ఈ సారి మరో అమ్మాయి దగ్గర మీ ప్రేమకథలు వినిపించేప్పుడు శ్రీలక్ష్మి కూడా మీ పాదాల దగ్గర సర్వస్వం అర్పించి మీ ప్రేమభిక్ష కోరిందని చెప్పుకోవచ్చు.

వెళ్లగానే లెటరు వ్రాయమనడంలో మీ ఉద్దేశ్యం ప్రేమలేఖ లాంటిది రాయమనే. అందుకే 'ప్రేమలేఖా'? అని అడిగాను. ఇది... ప్రేమ లేఖా?!

-శ్రీలక్ష్మి

*'విశాఖ', 1965*